సాక్షి
ఖమ్మం
గురువారం । 9 । జనవరి । 2025



గురుకులాలు పిలుస్తున్నాయి..
2025–26 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 8లో



పంటల్లోకి 'భక్త రామదాసు' నీరు
గుర్తుతెలియని వ్యక్తులు గేట్లు మూయడంతో కూసుమంచికి వెళ్లాల్సిన భక్త రామదాసు నీరు దారి మళ్లింది. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 15°

వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారు జామున, రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
డీఐఈఓ రవిబాబు



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

చింతకాని : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఐఈఓ రవిబాబు అన్నారు. మండలంలోని నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవుతున్న క్రమంలో ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని సూచించారు. విద్యార్థి దశలో ఇంటర్ చాలా కీలకమని, రానున్న వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి కళాశాలకు, మండలానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. హెల్ప్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్ విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సుడా సీపీఓగా రాజ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్ : స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఎం.రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడ టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్‌గా, సీపీఓగా విధులు నిర్వర్తిస్తున్న రాజ్‌కుమార్‌ను సుడా సీపీఓగా బదిలీ చేశారు. దీంతో పాటు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ) బాధ్యతలు కూడా అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి
డీఈఓ సోమశేఖర శర్మ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

కల్లూరు: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు సాధించాలని డీఈఓ సోమశేఖర శర్మ ఉపాధ్యాయులను కోరారు. కల్లూరులోని బాలికోన్నత పాఠశాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. 6,7,8 తరగతులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నడుస్తుండగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారిచ్చిన సమాధానాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులంతా 10/10 జీపీఏ గ్రేడ్‌లు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పాదిలి పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా క్రిస్టియన్ మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందిస్తున్నారని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ తెలిపారు. కుట్టు మిషన్ల కోసం ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో tgobmms. cgg. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ చేశాక సంబంధిత ధ్రువపత్రాలను జత చేసి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కమనీయం.. శ్రీ కృష్ణావతారం



వైభవోపేతంగా కిట్టయ్యకు ఊంజల్‌సేవ

- నేడు శ్రీసీతారామ చంద్రస్వామివారి తెప్పోత్సవం

భద్రాచలం: ముగ్ధమనోహరమైన రూపం.. చూడచక్కని ఆకారం.. కిరీటంపై నెమలి ఈకలతో చెంతనే సీతామహాదేవి.. ఆ పక్కనే లక్ష్మణస్వామితో బంగారపు ఊయలలో ఊగుతున్న శ్రీకృష్ణావతారంలో రామయ్య.. కమనీయమైన ఈ దృశ్యాన్ని వీక్షించిన భక్తులు తన్మయత్వం పొందారు. వైకుంఠ ఏకాదశీ అధ్యయనోత్సవాల్లో భాగంగా రామాలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. స్వామివారు బుధవారం శ్రీకృష్ణావతారంలో దర్శనమిచ్చారు. గత నెల 31న ప్రారంభమైన స్వామివారి అవతారాలు ఈ నెల 8వ తేదీతో ముగిశాయి. తొలుత స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవతారాల్లో భాగంగా శ్రీకృష్ణావతారుడైన రామయ్యకు వైభవోపేతంగా ఊంజల్ సేవ జరిపారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు కీర్తనలు ఆలపిస్తుండగా ఆలయ అర్చకులు శ్రీకృష్ణుడైన రామయ్యను ఊయల్లో ఊపుతూ వేద మంత్రాలు చదివారు. అనంతరం హారతిని సమర్పించారు. డోలోత్సవంలో పాల్గొని స్వామివారిని చూసి తరించిన భక్తులకు వెయ్యి అశ్వమేధయాగ ఫలాలకు దక్కినంత పుణ్యం, సర్వపాపాలు తొలగి సుఖసంతోషాలు లభిస్తాయని పండితులు భక్తులకు వివరించారు. వెన్న, అటుకులు, బెల్లం భక్తులు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. వీటిని స్వామివారికి నివేదన ఇచ్చి ఆ తర్వాత భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తజనంతో పండుగ శోభ సంతరించుకుంది. అనంతరం స్వామివారిని పల్లకీపై ఊరేగింపుగా కోలాటాలు, మేళతాళాలు నడుమ మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసుకొచ్చి ఆశీనులు చేశారు. భక్తుల దర్శనార్థం తిరువీధి సేవ ఘనంగా జరిపారు. ఆస్థాన మండపంలో స్వామివారికి దర్బార్ సేవ, ఆరాధన, నివేదన ఇచ్చి స్వామివారికి పవళింపు సేవ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు తిరుమంగైఆళ్వార్ పరమపదోత్సవం
శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో గురువారం తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం జరగనుంది. రామాలయంలోని ఆస్థాన మండపంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. తిరుమంగై ఆళ్వార్ స్వామివారి పాదాల చెంత పరమపదించి అనంతరం స్వామివారి అనుగ్రహంతో జీవం పోసుకుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ ఏటా తెప్పోత్సవం రోజు ఆలయంలో ఈ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ.

నేటి కార్యక్రమాలు

- ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సేవాకాలం, తిరుమంగై ఆళ్వారుల పరమపదోత్సవం
- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు రాజభోగం, శాత్తుముర్రై, పూర్ణ శరణాగతి సేవ, పగల్‌పత్తు సమాప్తి
- మధ్యాహ్నం 3గంటలకు దర్బారు సేవ
- సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు స్వామివారిని ఊరేగింపుగా గోదావరి నదీ వద్దకు చేర్చుతారు.

నేడు గోదావరిలో విహారం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు స్వామి వారు సీతా లక్ష్మణ సమేతంగా పవిత్ర గోదావరి నదిలో హంసవాహనంపై విహరించనున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ రెండు వేడుకలను కనులారా తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటికే భారీ సంఖ్యలో భక్తులు భద్రాచలం చేరుకున్నారు. వారికి తగిన వసతి, సౌకర్యాల కల్పనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



తెప్పోత్సవానికి సిద్ధమైన హంస వాహనం (ఇన్‌సెట్) కృష్ణావతారంలో భద్రాద్రి రామయ్య

కోతలకు చెక్ !

- రానున్న వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రణాళిక
- రూ.9.35 కోట్లతో 10 సబ్‌స్టేషన్లలో 8 ఎంవీఏలు
- అదనంగా 655 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కసరత్తు
- 1,700 మెగావాట్ల విద్యుత్ వినియోగానికి చర్యలు



సబ్ స్టేషన్లలో పనులను పర్యవేక్షిస్తున్న ఎస్ఈ సురేందర్, అధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: వేసవిలో విద్యుత్ సమస్యలు ఎదురుకాకుండా ఎన్పీడీసీఎల్ ముందస్తుగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించింది. జిల్లాలో గత అనుభవాలు, విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుని తదనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టారు. వేసవి ఉష్ణోగ్రతలు, జలాశయాల్లో నీరుండటంతో యాసంగి పంటల సాగు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యుత్ ప్రణాళికకు రూపకల్పన చేశారు. విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని లోడుకు తగిన విధంగా సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టారు. వేసవిలో విద్యుత్ అంతరాయాలకు చెక్ పెట్టేలా చర్యలు తీసుకోవాలనే వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ఇప్పటికే పలు ప్రాధాన్యతా ప్రాంతాల్లో ఈ ప్లాన్‌ను అమలు చేస్తోంది. జిల్లాలో 33/11 కేవీ సబ్ స్టేషన్లు 125 ఉన్నాయి. వీటి నుంచి 545 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. జిల్లాలో ఏటేటా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. గతేడాది విద్యుత్ కనెక్షన్ల ఆధారంగా జిల్లాకు ఎన్పీడీసీఎల్ 1,412.44 మెగావాట్ల విద్యుత్ కేటాయించింది. దీనిలో 1,285.23 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఈ ఏడాది వేసవి నాటికి పెరగనున్న వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని అందుకు అనుగుణంగా విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టారు.

ఎంవీఏల సామర్థ్యం పెంపు..
సాధారణంగా సబ్ స్టేషన్లు 5 ఎంవీఏ(మెగా వోల్ట్ యాంపియర్లు)లుగా ఉంటాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండడంతో సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా సబ్ స్టేషన్లను గుర్తించిన విద్యుత్ శాఖ 5 ఎంవీఏల స్థానంలో సామర్థ్యాన్ని పెంచి 8 ఎంవీఏల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జిల్లాలోని 10 సబ్ స్టేషన్లలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో ఎంవీఏ ఏర్పాటుకు రూ.85 లక్షల చొప్పున ఖర్చవుతుంది. ఇప్పటికే మిట్టపల్లి, జన్నారం, బత్తులపల్లి సబ్ స్టేషన్లలో 8 ఎంవీఏలను ఏర్పాటు చేశారు. ఖమ్మం నగరంలోని ఖానాపురం సబ్ స్టేషన్‌లో రెండు 8 ఎంవీఏలు, టౌన్–3 ఐడీఏ సబ్ స్టేషన్, బురహాన్‌పురం, గాంధీచౌక్–2, రామాలయం, తల్లాడ, పెద్దకోరుకొండి సబ్ స్టేషన్లలో 8 ఎంవీఏల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. నగరంలోని మమత రోడ్ సబ్ స్టేషన్‌లో 12.5 ఎంవీఏ, ఇల్లెందు క్రాస్ రోడ్, టేకులపల్లి, కొత్త లింగాల, తనికెళ్ల సబ్ స్టేషన్లలో 12.5 8 ఎంవీఏలను గతేడాది ఏర్పాటు చేశారు.

అవసరమైతే నూతన ట్రాన్స్‌ఫార్మర్లు..
జిల్లాలో మరో 655 నూతన ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని విద్యుత్ శాఖ గుర్తించింది. ఖమ్మం నగరంతో పాటు గ్రామాల్లో అవసరమైన చోట వీటిని ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమైంది. ప్రాధాన్యతా క్రమంలో ఇప్పటికే 162 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి నాటికి ఎంపిక చేసిన సబ్ స్టేషన్లలో 8 ఎంవీఏల ఏర్పాటు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లు జరిగేలా విద్యుత్ శాఖ ప్రణాళిక రూపొందిస్తోంది. ఇక తొండలు, బల్లులు, ఉడతలు వంటి వాటితో ట్రాన్స్‌ఫార్మర్లలో, ఫ్యూజ్‌ల్లో సమస్యలు తలెత్తకుండా డెన్‌ప్లాస్ట్ ఇన్సులేషన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు.

కోటా పెరిగినా ఇక్కట్లు రాకుండా..
జిల్లాలో పెరుగుతున్న వినియోగానికి తగ్గట్టుగా విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలకు ఎన్పీడీసీఎల్ ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాకు గతేడాది 1,412.44 మెగావాట్ల విద్యుత్ కోటా కేటాయించిన సంస్థ ఈ ఏడాది 1,700 మెగావాట్లకు అనుగుణంగా సాంకేతిక ఏర్పాట్లకు ప్రాధాన్యం ఇస్తోంది. సమృద్ధిగా కురిసిన వర్షాలతో జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో విస్తారంగా పంటలు సాగయ్యే అవకాశం ఉండటం, పారిశ్రామిక అవసరాలు పెరగటం, ఖమ్మం నగరంలో వాణిజ్య వ్యవస్థ గణనీయంగా పెరగటం, ప్రజల విద్యుత్ వినియోగం కూడా పెరగటంతో అందుకు అనుగుణంగా సరఫరాను పెంచేలా చర్యలు చేపట్టింది.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు	
గృహాలు	4,92,745
వ్యవసాయం	1,18,267
పరిశ్రమలు	65,822
ఇతరాలు	12,839
మొత్తం	6,90,273

ప్రత్యేక కార్యాచరణతో కనెక్షన్లు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ప్రత్యేక కార్యాచరణ అవలంబిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఎ. సురేందర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది 4,437 సర్వీసులు మంజూరు చేశామని చెప్పారు. వ్యవసాయ సర్వీసుల మంజూరుకు ఆన్‌లైన్ విధానంతో ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. దరఖాస్తులు ఎక్కడ పెండింగ్‌లో ఉన్నాయో కూడా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ వైద్య సేవలుండాలి
- ఖమ్మం ఆస్పత్రిని 575 పడకలకు పెంచాలి
- ఆస్పత్రుల పనితీరుపై మంత్రి తుమ్మల సమీక్ష



మంత్రి దామోదర, డీఎంఈ వాణితో కలిసి సమీక్ష చేస్తున్న తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యానికి దీటుగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణితో కలిసి హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, వసతులు, వైద్య కళాశాల స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. పేదలకు ఖరీదైన వైద్యసేవలన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అందించాలని సూచించారు. అన్ని వసతులు, అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ప్రభుత్వ వైద్య సేవలు ఉండాలని చెప్పారు. పేదలకు కార్పొరేట్ వైద్య సేవలే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. ఖమ్మం ఆస్పత్రిలో గతంలో 500 పడకలు ఉండగా కరోనా సమయంలో 420కి తగ్గించారని, మళ్లీ 575 పడకలకు పెంచేలా ప్రతిపాదనలు పంపామని, దానిని తక్షణమే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మం, కల్లూరు, సత్తుపల్లి తదితర ఆస్పత్రుల్లో ఆధునిక హంగులతో వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఖాళీ పోస్టుల భర్తీకి ఆదేశం..
జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని మంత్రి తుమ్మల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎక్కడా వసతులు, పరికరాలు లేవనే మాట వినిపించవద్దన్నారు. వివిధ విభాగాల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని, వైద్య పరీక్షల నిర్వహణకు టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలకు ఆపద సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు 104, 108 వాహనాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

సంక్రాంతి తర్వాత మెడికల్ కాలేజీకి శంకుస్థాపన..
సంక్రాంతి తర్వాత మెడికల్ కళాశాల పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు. కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణం అద్భుతంగా, అత్యాధునికంగా ఉండాలన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలని మంత్రి రాజనర్సింహను కోరగా, పరిశీలించి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

నేటి నుంచి మూడు రోజులు పర్యటన

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురు, శుక్ర, శనివారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం టేకులపల్లిలో డైట్ కాలేజీ అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశాక, 11.30 గంటలకు తల్లాడ మండలం నూతనకల్‌లో సహకార భవనం ప్రారంభిస్తారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సత్తుపల్లి బుగ్గపాడులో ఆర్అండ్‌బీ రోడ్డు, 10 గంటలకు కాకర్లపల్లిలో బీటీ రోడ్డు, సీసీ రోడ్డు, 10.30 గంటలకు సత్తుపల్లిలో సింగరేణి అగ్రికల్చర్ గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.30 గంటలకు రామగోవిందాపురంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. శనివారం ఉదయం 10 గంటలకు దమ్మపేట మండలం కట్కూర్‌లో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, 11 గంటలకు పూసుకుంటలో పామాయిల్ మొక్కలు నాటుతారు.

రైతుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్: రైతుల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రైతు బీమా కింద 420 దరఖాస్తులు వస్తే వ్యవసాయ శాఖ నుంచి 347 దరఖాస్తులు ఎల్ఐసీకి సమర్పించామని, 311 రైతు కుటుంబాలకు క్లెయిమ్ సొమ్ము అందిందని, 36 పురోగతిలో ఉన్నాయని వివరించారు. వ్యవసాయ అధికారులు మానవీయ దృక్పథంతో పని చేయాలని, రైతుల దరఖాస్తుల్లో ఏవైనా డాక్యుమెంట్లు లేకుంటే సమకూర్చే మార్గం తెలియజేయాలని సూచించారు. ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పని చేయాలని, వారి పనితీరు మెరుగుపడేలా మండల వ్యవసాయ అధికారులు సహకరించాలని అన్నారు. క్రాప్ బుకింగ్ సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలోని పెద్ద రైతులను, స్థానిక నాయకులను గుర్తించి ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని, ఆ పంట సాగయ్యేలా చూడాలని సూచించారు.



ఖమ్మంరూరల్ : డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

24 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు..
జిల్లాలో నాలుగు ప్రదేశాల్లో 24 ఎకరాల స్థలాన్ని సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు గుర్తించామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుంచి వీసీకి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంకా 150 ఎకరాల మేర స్థలం పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలతో తదుపరి చర్యలకు కార్యాచరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పంపిణీకి 'డబుల్' ఇళ్లు సిద్ధం..
ఖమ్మంరూరల్: ప్రభుత్వ లక్ష్యం మేరకు సంక్రాంతి లోపు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మండలంలోని మల్లెమడుగులో మూడు బ్లాక్‌ల్లో నిర్మిస్తున్న 84 డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్రాంతి లోపు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీకి సిద్ధం చేయాలని తెలిపారు. మల్లెమడుగులో 84, కూసుమంచి మండలం దుబ్బతండాలో 29, నేలకొండపల్లి మండలం అచార్లగూడెంలో 18.. మొత్తం 131 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం వరంగల్ క్రాస్‌రోడ్‌లోని లెప్రసీ కాలనీలో పర్యటించిన కలెక్టర్ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు రేషన్‌కార్డులు లేవని, ఆస్పత్రి అందుబాటులో లేదని కలెక్టర్‌కు విన్నవించగా మార్చిలో అర్హులందరికీ కార్డులు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్డీఓ సన్యాసయ్య, విద్యుత్ ఎస్ఈ సురేందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి, డీఏఓ డి. పుల్లయ్య, హార్టికల్చర్ అధికారి ఎం.వి. మధుసూదన్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీఓ నర్సింహారావు, ఖమ్మంరూరల్, అర్బన్ తహసీల్దార్లు పి. రాంప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 అడుగులకు చేరిన 'పాలేరు'



జలకళ సంతరించుకున్న రిజర్వాయర్ (ఇన్‌సెట్) నీటిమట్టం సూచిక

కూసుమంచి : పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం బుధవారానికి 20.03 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌కు సాగర్ నుంచి 5,068 క్యూసెక్కుల నీరు చేరుతుండగా ఎడమ కాలువ ద్వారా జిల్లాలోని ఆయకట్టుకు 4,069 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పాలేరు కాలువకు 150 క్యూసెక్కులతో పాటు భక్తరామదాసు ప్రాజెక్టుకు మరో 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం 135 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. రిజర్వాయర్‌కు సాగర్ నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈనెల 11 నుంచి ఆరు రోజుల పాటు ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేయనుండగా, 23 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరే అవకాశం ఉంది.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం

డీపీఓ ఆశాలత

నేలకొండపల్లి : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని డీపీఓ పి.ఆశాలత అన్నారు. మండలం లోని బోదులబండ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. మంచినీటి కుళాయిలు, టాయిలెట్లు శుభ్రంగా ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సరిపడా సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌లు అందుబాటులో ఉన్నాయని, పేపర్ల ముద్రణ టెండరింగ్ కూడా పూర్తయిందని తెలిపారు. ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లా రాష్ట్రంలో ఆరో స్థానంలో ఉందని చెప్పారు. ఇప్పటి వరకు 40 శాతం మాత్రమే పూర్తయిందని, ఫిబ్రవరి నాటికి నూరు శాతం వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సీహెచ్.శివ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీఓ ఆశాలత

రక్తదానంతో ప్రాణాలు రక్షించొచ్చు

ఆర్టీసీ ఆర్ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్ : ప్రమాద సమయంలో అవసరమైన వారికి రక్తదానం చేస్తే వారి ప్రాణాలు కాపాడొచ్చని, రక్తదాతలు ప్రాణదాతలని ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం ఎ.సరిరామ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఖమ్మం డిపో ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్‌లో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆర్ఎం మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నందున క్షతగాత్రులకు రక్తం అత్యవసరమని, సమయానికి దొరకకుంటే ప్రాణాపాయం తప్పదని అన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, పర్సనల్ ఆఫీసర్, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, సీఐ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు అనారోగ్యం

ఖమ్మంసహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం రాత్రి అనారోగ్యానికి గురయ్యారు. ఆయనకు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆయనను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరామర్శించారు. బుధవారం శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సీఎం కప్ పోటీల్లో సత్తా

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. గత నెల 27 నుంచి ఈనెల 2 వరకు వివిధ క్రీడాంశాల్లో 382 మంది క్రీడాకారులు పాల్గొనగా 47 పతకాలు లభించాయి. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, నెట్‌బాల్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఉషూ, ప్యారా బ్యాడ్మింటన్, ప్యారా సైక్లింగ్ అంశాల్లో అత్యధిక పతకాలు వచ్చాయి. జిల్లా క్రీడాకారులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ ఎండీ.గౌస్ హర్షం వ్యక్తం చేశారు.

11న జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 11న జిల్లాస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ ఎంపికలను నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ వయసు ధ్రువీకరణపత్రంతో పాటు అప్‌డేటెడ్ ఆధార్ కార్డు వెంట తీసుకుని ఉదయం పది గంటలకు రిపోర్టు చేయాలన్నారు.

12న జిల్లాస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 12న జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి నున్న రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 30 ఏళ్లు దాటిన పురుషులు, మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. జిల్లా జట్టులో స్థానం పొందిన వారు ఈనెల 19న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్ పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 984823456, 9490021220 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కలుషిత నీరుతాగి 15 మందికి అస్వస్థత



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని రఘునాథగూడెం గ్రామంలో బుధవారం కలుషిత నీరు తాగి 15 మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని బోరు పంపు నీరు తాగగా 15 మందికి వాంతులు, విరేచనాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే చెన్నూరులోని ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు తబస్సుమ్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి బాధితులకు చికిత్స అందించారు. మరో రెండు రోజులపాటు వైద్య శిబిరం ఉంటుందని, ఎవరికీ ఏప్రమాదం లేదని వైద్యులు వివరించారు.


భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన ఆలస్యం తిరుమల్‌రావుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన తిరుమల్‌రావు తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ నెల 5న మద్యం సేవించి భార్యతో గొడవ పడ్డాడు. వేధింపులు తాళలేక భార్య సునంద బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగుల్‌మీరా వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడి

ఖమ్మంఅర్బన్: నగరంలోని దానవాయిగూడెం వద్ద పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేసి, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,030 నగదు, 4 బైకులు, 4 సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకున్నామని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. కొందరు పారిపోయారని చెప్పారు.

గంజాయి దహనం



గంజాయిని దహనం చేస్తున్న అధికారులు

తల్లాడ: ఖమ్మం, వైరా, సింగరేణి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన 757 కిలోల గంజాయిని తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామంలో ప్రభుత్వ ఆమోదిత ఎడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్‌లో బుధవారం దహనం చేశారు. డిస్పోజబుల్ అధికారి ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.1.89 కోట్ల విలువ చేసే గంజాయిని దహనం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్, నాగేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకులాలు పిలుస్తున్నాయి..

- ఉమ్మడి జిల్లాలో 48 గురుకుల విద్యాలయాలు
- 3,840 మంది విద్యార్థులకు ప్రవేశం
- 5 తరగతితో పాటు 6 నుంచి 9 వరకు ఖాళీలకు పరీక్ష



నేలకొండపల్లి గురుకుల పాఠశాల

నేలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలను నెలకొల్పింది. ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ బోధన అందించడం, ఇక్కడ చదివే విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతుండటంతో ఏటా వీటిలో ప్రవేశాలకు పోటీ అధికంగా ఉంటోంది. 2025–26 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9 తరగతిలో ప్రవేశాలకు గురుకులాల సంస్థ ప్రకటన విడుదల చేసింది. దీంతో దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేయాల్సి ఉంటుంది. గతంలో విద్యార్థి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఫొటో సంతకం ఉంటే సరిపోయేది. ఈసారి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్లను కూడా జత చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 5వ తరగతి ప్రవేశాలకు ఒకసారి, ఆరు నుంచి 9 తరగతులకు మరోసారి దరఖాస్తులు స్వీకరించే వారు. అర్హత పరీక్ష వేర్వేరు తేదీల్లో నిర్వహించే వారు. ప్రస్తుతం అన్ని తరగతులకు ఒకేసారి ప్రవేశ ప్రక్రియ చేపట్టారు. అర్హత పరీక్ష అన్నీ కూడా ఒకే రోజు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రతీ గురుకులంలో 80 సీట్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలు మొత్తం 22 ఉండగా, బీసీ గురుకులాలు మొత్తం 26 ఉన్నాయి. వీటిలో ప్రతీ గురుకులానికి 80 సీట్లు చొప్పున జిల్లావ్యాప్తంగా 5వ తరగతిలో 3,840 సీట్లు ఖాళీలున్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. వీటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 1 వరకు గడువు ఉంది. ఇక మిగిలిన 6, 7, 8, 9 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కూడా అదే రోజు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్..

గురుకులాల్లో ప్రవేశాల కోసం సమాచారం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేసేందుకు అందుబాటులో ఉంచారు. ప్రవేశాలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు ఎంపీడీఓ, ఎంపీఓలకు బాధ్యతలు అప్పగించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

ఇవి కావాలి..

- వచ్చే విద్యా సంవత్సరానికి గురుకులంలో ఆయా తరగతులకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు మీ సేవ కేంద్రాల ద్వారా ముందుగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలి.
- విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ లేదంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకోవాల్సిందే.
- ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, (ఓటీపీ కోసం), విద్యార్థి ఫొటో కావాల్సి ఉంటుంది.
- గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ వాసులకు రూ.2 లక్షలలోపు ఉండాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..



గురుకులంలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీ సేవ కేంద్రాలకు వెళ్తే సులభంగా ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. గురుకులాల్లో చేరి, విద్యావంతులై ఉన్నస్థాయికి చేరుకోవాలి.

– పద్మావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, నేలకొండపల్లి

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మెనూలో భారీ మార్పులు చేసింది. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు గురుకులాలు ఓ వరం లాంటిది.

– బచ్చలకూరి నాగరాజు, సేవాదళ్ కన్వీనర్

విస్తృత ప్రచారం చేస్తున్నాం..



విద్యార్థులకు మంచి అవకాశం దొరికింది. తల్లిదండ్రులు వెంటనే ఆన్‌లైన్‌లో గురుకులాలకు దరఖాస్తు చేసుకుని విద్యార్థులకు సీట్లు సాధించి వారి భవిష్యత్ మారేలా చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే గ్రామాల్లో వివిధ రూపాలలో ప్రచారం చేయిస్తున్నాం.

– ఎం.ఎర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

తాళం వేస్తే కన్నం వేసినట్లే..!

ఖమ్మం కమిషనరేట్‌లో దొంగల హల్‌చల్

- జిల్లావ్యాప్తంగా దొంగల ముఠా సంచారం
- అప్రమత్తమైన పోలీస్ శాఖ

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతీ రోజు ఎక్కడో ఒక దగ్గర చోరీ జరుగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. కొన్ని నెలలుగా దొంగలు హల్‌చల్ చేస్తూ కోట్లాది రూపాయల సొమ్మును కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని, చోరీలకు పాల్పడుతున్నారు. తాళం వేసి, ఏదైనా పని మీద బయటకు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఇంట్లో ఉన్నదంతా దోచుకొని వెళ్తున్నారు. జిల్లా కేంద్రమైన ఖమ్మంలో గతంలో ఎన్నడూ లేని విధంగా, ఎంతో చాకచక్యంగా దుండగులు వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

రెక్కీ చేసి మరి..

జిల్లావ్యాప్తంగా దొంగలు రెక్కీ చేసి మరి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఉదయం అంతా ఆయా ప్రాంతాల్లో ఏదో పని ఉన్నట్లు తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చుట్టూ ఉన్న పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి తమకు అనుకూలంగా ఉన్న ఇళ్లను ఎంచుకొని మరీ దొంగతనాలు చేస్తున్నారని తెలుస్తోంది. జిల్లా కేంద్రాన్ని అడ్డాగా చేసుకొని మరీ దొంగతనాలు చేస్తున్నట్లు సమాచారం. వరుసగా జరుగుతున్న దొంగతనాలను బట్టి చూస్తే జిల్లావ్యాప్తంగా దొంగల ముఠా సంచారం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు కారణం వరంగల్, ఖమ్మంకు జిల్లా జైలు ఒక్కటే కావటం కూడా ఒక కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. జైల్లో అన్ని ప్రాంతాల నుంచి వచ్చే నిందితుల మధ్య స్నేహం ఏర్పడి, తిరిగి వారంతా కలిసి చోరీలు చేస్తున్నారని, దీంతో దొంగతనాలు పెరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం. ఏపీ ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ తక్కువగా ఉంటుందో, ప్రజల సంచారం తక్కువగా ఉంటుందో.. జైల్లోనే దొంగలు తెలుసుకుని ఆ ప్రాంతాల్లో దొంగతనాలు చేసి సులువుగా తప్పించుకుంటున్నారు. దొంగలు ఒక ముఠాగా ఏర్పడి ఒకే చోట కాకుండా ఒక్కో వీధిలో తాళం వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి అవలీలగా తాళం పగులకొట్టి ఇంట్లో ఉన్న సొత్తును ఎత్తుకుపోతున్నారు. ఇటీవల టూటౌన్ పరిధిలో ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన చోరీ ఘటనలో దొంగ దాదాపు గంటసేపు ఉండి సొత్తు చోరీ చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని దొంగే పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం. రెండు రోజుల కిందట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అనుచరుడైన వనం నర్సింగరావు నివాసంలో చోరీ జరిగిన విషయం విదితమే. గతంలో కూడా ముదిగొండ మండలం కమలాపురంలో సైతం ఆయన గృహంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు.

పోలీసుల ప్రత్యేక దృష్టి

ఖమ్మం నగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో పోలీస్ శాఖ అప్రమత్తం అయినట్లు సమాచారం. రానున్న సంక్రాంతి పండుగ దృష్ట్యా దొంగతనాలు పెరిగే అవకాశం ఉండటంతో లా అండ్ ఆర్డర్, సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. లాడ్జీలు, శివారు ప్రాంతాల్లో కొత్తగా కనిపించేవారు, జైలు నుంచి విడుదలయ్యే దొంగల కదలికలపై నిఘా పెట్టినట్లు సమాచారం. అయితే, పోలీస్ పెట్రోలింగ్ పూర్తిగా కొరవడిందని, ఏమీ పట్టించుకోకపోవడంతో ఎప్పుడూ లేనివిధంగా చోరీలు పెరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గస్తీ బాగా పెంచాం..



ఖమ్మంలో దొంగతనాలను అరికట్టడానికి పోలీస్ గస్తీ పెంచాం. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు పోలీస్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగేలా చూస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాం. రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా తాళాలు వేసి వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలి. లేదా ఇంటి పక్కన ఉన్న వారికి తెలపాలి. విలువైన వస్తువులన్నీ లాకర్‌లోనే భద్రపరచుకొని వెళ్లాలి. అపరిచితులకు ఇళ్లు కిరాయికి ఇవ్వొద్దు. రాత్రి అపరిచితులు ఎవరైనా కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

– రమణమూర్తి, ఏసీపీ

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం



మాట్లాడుతున్న బాధితులు

కామేపల్లి: సింగరేణిలో పర్మనెంట్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.1.50 కోట్లు వసూల్ చేశాడో సబ్‌స్టేషన్ ఆపరేటర్. బుధవారం తాళ్లగూడెంలో విలేకర్ల సమావేశంలో బాధితులు వివరాలు వెల్లడించారు. ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న గోవింద్రాల గ్రామానికి చెందిన బోడా మంగ్యాజీనాయక్ కామేపల్లి, కారేపల్లి మండలాలకు చెందిన పలువురు నిరుద్యోగులకు సింగరేణిలో పర్మనెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ.2 నుంచి 6 లక్షల మేర వసూలు చేశాడు. కొంతకాలానికి ఇంటర్వ్యూకు వెళ్లాలని సూచించడంతో అక్కడికి వెళ్తే ఎవరూ లేరని, మోసపోయామని గుర్తించామని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ, ఈ విషయాన్ని బయటకు తెలియకుండా పోలీసులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. మంగ్యాజీ నాయక్ విద్యుత్ శాఖలో పనిచేస్తూ, ఓ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడిగా, ఓ పీడీఎఫ్ పత్రికలో రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడని, పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు అతడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. ఎస్‌ఐ సాయికుమార్‌ని వివరణ అడగగా కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

54 మంది బైండోవర్

సత్తుపల్లిటౌన్: కోడి పందేలు, పేకాట నిర్వహించిన, సత్తుపల్లి మండలంలో ఇప్పటి వరకు 54 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోడిపందేలు, పేకాట నిర్వహణపై సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, వివరాలను డయల్ 100కుసమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఐలు రఘు, వీరేందర్, కవిత, ఏఎస్‌ఐ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరులో ముగ్గురు...

కల్లూరురూరల్: నాటుసారా కాస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం ఎక్సైజ్ పోలీసులు కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. నాటుసారా తయారు చేస్తున్నారని సమాచారం మేరకు సత్తుపల్లి ఎక్సైజ్ శాఖ సిబ్బంది గన్యాతండా, వాచ్యానాయక్‌తండా, చంద్యాతండాల్లో గాలింపు చేపట్టగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కల్లూరు తహసీల్దార్ పులి సాంబశివుడు ఎదుట బైండోవర్ చేశారు.

అందుబాటులో ఆడ దూడలు పుట్టే సెమెన్



మందులు పంపిణీ చేస్తున్న వెంకటనారాయణ

నేలకొండపల్లి: ఆడ దూడలు పుట్టే సెమన్‌ను సబ్సిడీపై అందించనున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ తెలిపారు. మండలంలోని అప్పలనరసింహాపురంలో బుధవారం గోపాలమిత్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ఆడ దూడల జననం కోసం ప్రత్యేకంగా సెమన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఒక్కో దాని ఖరీదు రూ.825 ఉండగా, ప్రభుత్వం రూ.625 సబ్సిడీ అందిస్తుందని, మిగతా రూ.200 రైతులు చెల్లించాలని సూచించారు.

పంటల్లోకి ‘భక్త రామదాసు’ నీరు

- ఇబ్బంది పడిన రైతులు
- కూసుమంచి వెళ్లకుండా గేట్లు మూసేయడమే కారణం..



కూసుమంచికి వెళ్లే గేట్లు మూసివెయ్యడంతో తిరుమలాయపాలెం మండలం వద్ద ఎస్సారెస్పీ కాలువ నిండుగా ప్రవహిస్తున్న భక్తరామదాసు నీరు

తిరుమలాయపాలెం: భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా తరలిస్తున్న నీటిని గుర్తుతెలియని వ్యక్తులు కూసుమంచి వెళ్లకుండా గేట్లు మూసేయడంతో బుధవారం తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో ఎస్సారెస్పీ కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహించి పంట పొలాల్లో నిలిచిపోయింది. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లిలో పంట పొలాలు, కూరగాయల తోటల్లో భారీగా నీరు నిలిచి రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. నీటి నిల్వతో కూరగాయ పంటలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు కూసుమంచి మండలానికి వెళ్లే కాలువకు నీటిని మళ్లించడంతో ప్రవాహం తగ్గింది. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ బాణాల రమేష్‌రెడ్డిని వివరణ కోరగా కూసుమంచికి వెళ్లే నీటిని గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో గేట్లు మూసేయడంతో తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలానికి భారీగా నీరు చేరిందని, ప్రస్తుతం ప్రవాహాన్ని తగ్గించామని తెలిపారు.

‘మోదీది రైతు వ్యతిరేక ప్రభుత్వం’



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే దిశగా పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీది రైతు వ్యతిరేక ప్రభుత్వమని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. దశాబ్ద కాలంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన సబ్సిడీలను ఎత్తివేయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పంటలకు మద్దతు ధర ప్రకటించాలని 44 రోజులుగా జగజిత్ సింగ్ దల్లేవాల్ చేస్తున్న నిరాహార దీక్షను ప్రభుత్వం ఉపసంహరింపజేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత వెంకటాయపాలెం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. హేమంతరావు మాట్లాడుతూ మోదీ సర్కార్ వ్యవసాయ రంగానికి సంబంధించి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని, సుదీర్ఘ కాలం పాటు భారతదేశ రైతాంగం సాగించిన బహుముఖ పోరాటాలతో తాత్కాలికంగా మూడు నల్ల చట్టాల అమలును ఉపసంహరించుకుందన్నారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని ప్రకటించేందుకు హామీ ఇచ్చిందని, కానీ, మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దొడ్డిదారిన నల్ల చట్టాల అమలుకు పూనుకుంటోందని తెలిపారు. వ్యవసాయ రంగానికి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని ప్రకటించడంలో విఫలమైందన్నారు. జాతీయ సంస్థలను, జాతి సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగించే పనిలో ఉందని మండిపడ్డారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్కె జానీమియా, బీజీ క్లైమెంట్, దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు, మిడికంటి వెంకటరెడ్డి, రామ్మూర్తి, తాటి వెంకటేశ్వరరావు, జాగర్లమూడి రంజిత్‌కుమార్, పగడాల మల్లేశ్, పుచ్చకాయల సుధాకర్, కూచిపూడి రవి, ఏనుగు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బ్లేడ్‌తో చేయి కోసుకున్న యువకుడు



రోడ్డు వెంట పడుకున్న యువకుడు

నేలకొండపల్లి: మతిస్థిమితం లేని ఓ యువకుడు బ్లేడ్‌తో చేయి కోసుకుని పరుగులు తీశారు. మండలంలోని మంగాపురంతండాకు చెందిన జి.నాగేశ్వరరావు (20) మతిస్థిమితం లేకపోవటంతో బుధవారం బ్లేడ్‌తో చేయి కోసుకుని గ్రామంలో పరుగులు తీశాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి రక్తం చేతులతో గంటను కొట్టటం, ఆరుపుల కేకలతో వింతగా ప్రవర్తించటంతో ఆందోళన చెందారు. గ్రామస్తులు బంధించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అన్నపై తమ్ముడి హత్యాయత్నం

ఖమ్మంక్రైం: అన్నపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన తమ్ముడిపై కేసు నమోదైంది. వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. నిజాంపేట ప్రాంతానికి చెందిన స్టాలిన్, రాజ్‌కుమార్, భానుప్రసాద్ ముగ్గురు సోదరులు. వీరికి అదే ప్రాంతంలో ఇల్లు ఉంది. రాజ్‌కుమార్‌కు వివాహం కాగా పెద్దవాడైన స్టాలిన్‌కు, చిన్నవాడైన భానుప్రసాద్‌కు వివాహం కాలేదు. పైఅంతస్తులో రాజ్‌కుమార్ కుటుంబంతో నివాసం ఉంటుండగా కింద స్టాలిన్, భానుప్రసాద్ ఉంటున్నారు. స్టాలిన్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ అప్పుడప్పుడూ వచ్చిపోతుంటాడు. వచ్చినప్పుడు మద్యం సేవించి తన సోదరుడైన భానుప్రసాద్‌తో గొడవపడతాడు. అలా ఇద్దరి మధ్య చాలాసార్లు గొడవలు జరిగాయి. రాజ్‌కుమార్ సర్దిచెప్పేవాడు. రెండు రోజుల కిందట హైదరాబాద్ నుంచి వచ్చిన స్టాలిన్ మంగళవారం రాత్రి మద్యం సేవించి భానుప్రసాద్‌తో గొడవపడ్డాడు. కోపోద్రిక్తుడైన భానుప్రసాద్ బయటకు వెళ్లి పెట్రోల్ కొనుగోలు చేసి వచ్చాడు. అదే సమయంలో మద్యం మత్తులో నిద్రిస్తున్న స్టాలిన్‌పై సీసాలో ఉన్న పెట్రోల్ పోసి నిప్పంటించాడు. స్టాలిన్ కేకలు వేస్తూ బయటకు పరుగెత్తాడు. రాజ్‌కుమార్ స్థానికుల సాయంతో మంటలను ఆర్పివేసి ఆస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా మారటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

సాగర్ కాల్వలో పడి వ్యక్తి మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

పెనుబల్లి: సాగర్ కాల్వలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కొత్తకారాయిగూడేనికి చెందిన ఉలాస వెంకటేశ్వరరావు (58) ఎన్నెస్పీ కాల్వ వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. వీఎం బంజర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేశ్వరరావు మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి...



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎర్రుపాలెం: మండల కేంద్రం తొండలగోపవరం రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం సాయంత్రం గుర్తుతెలియని (50) వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. తొండలగోపవరం –ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య దిగువ మెయిన్ లైన్ రైలు పట్టాలపై వెళ్తున్న గూడ్స్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. రైల్వే ఎస్‌ఐ పి.భాస్కరరావు కేసు నమోదు చేశారు.

క్వారీ నీటి గుంతలో పడి యువకుడు...



రామలింగేశ్వరరావు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని మలుగుమాడు – నాగవరప్పాడు గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఉన్న ఓ క్వారీ గుంతలో పడి యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధిర మండలం నాగవరప్పాడు గ్రామానికి చెందిన బత్తుల రామలింగేశ్వరరావు (28) కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగుండకపోవడంతో పాటు ఫిట్స్ కూడా ఉంది. ఈ నెల 7వ తేదీన పొలాలకు పురుగుమందు పిచికారీ చేసేందుకు కూలీ పనులకు వెళ్లిన రామలింగేశ్వరరావు తిరిగి ఇంటికి రాలేదు. ఆరోజే నీటి గుంతలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. నీటి గుంతలో మృతదేహం తేలియాడుతోందనే సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా చేశామని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.వెంకటేశ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న బాలుడు...

పెనుబల్లి: బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో ఓ బాలుడు పురుగులమందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఏరుగట్ల గ్రామానికి చెందిన సాగబోయిన ఆనంద్ (17) తనకు కుటుంబ సభ్యులు మోటారు సైకిల్ కొనివ్వలేదని మనస్తాపం చెందాడు. ఈ నెల 5న పురుగులమందు తాగగా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.